సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 23 । జనవరి । 2024

9



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వెలగపూడి వెంకటేశ్వరరావు దంపతులు (విజయవాడ) రూ.50 వేల విరాళం అందజేశారు.




చదువుల మదింపు

10లో

విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3 (ఎఫ్‌ఏ-3) పరీక్షలు మంగళవారం ప్రారంభమవుతున్నాయి.

10,950 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 10,950 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

స్పందనకు 131 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వచ్చిన 131 మంది వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. వీటిలో ఆన్‌లైన్‌లో 116, ఆఫ్‌లైన్‌లో 15 చొప్పున వచ్చాయి. వారి నుంచి కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, స్పందన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు వారి పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి పరిధిలో లేని వాటిని సంబంధిత శాఖల అధికారులు పంపించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ఏ ఒక్క అర్జీదారునూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపిక



రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపికైన విద్యార్థులు


నిడదవోలు రూరల్: తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణశాస్త్రి సోమవారం ఈ విషయం తెలిపారు. తణుకులో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు ఎం.సురేష్, కె.రుషిత, పి.శ్యామల ప్రతిభ చూపి, కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను, పీడీ ప్రదీప్‌కుమార్‌ను ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మంగళవారం పలు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పందలపాక-1 (బిక్కవోలు), చాగల్లు-2 (చాగల్లు), కామరాజుపేట-1 (గోకవరం), గోపాలపురం-1 (గోపాలపురం), జేగురుపాడు-1 (కడియం), కుమారదేవం-1 (కొవ్వూరు), అనంతపల్లి-2 (నల్లజర్ల), తాడిమళ్ల-2 (నిడదవోలు), ఖండవల్లి-3 (పెరవలి), కాతేరు-4 (రాజమహేంద్రవరం రూరల్), రాజానగరం-3 (రాజానగరం), మర్రిపూడి (రంగంపేట), ఉండ్రాజవరం-1 (ఉండ్రాజవరం) సచివాలయాల పరిధిలో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆమెదే అగ్రస్థానం

- ఓటర్ల తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 16,05,762
- పురుషులు 7,85,142
- స్త్రీలు 8,20,515
- ఇతరులు 105





ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ పూర్తయ్యింది. ఓటర్ల లెక్క తేలింది. తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత సోమవారం విడుదల చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 16,05,762 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,85,142 మంది కాగా, వీరికంటే 35,373 మంది మహిళలు అధికంగా ఉన్నారు. మహిళా ఓటర్లు 8,20,515 మంది ఉన్నారు. వీరితో పాటు ఇతరులు 105 మంది ఉన్నారు.

విస్తృత అవగాహనతో..

గతంలో ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 15,52,268 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 16,05,762కు పెరిగింది. అంటే మొత్తం 53,494 మంది ఓటర్లు పెరిగారన్నమాట. ఓటర్ల సంఖ్య పెరగడానికి అధికార యంత్రాంగం ప్రత్యేకంగా నిర్వహించిన చైతన్య కార్యక్రమాలు దోహదపడ్డాయి. కలెక్టర్ మాధవీలత ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఓటు నమోదుపై వివిధ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కొత్తగా 18 సంవత్సరాల వయస్సు పూర్తయిన వారిపై దృష్టి సారించారు. దీంతో ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగింది.

నమోదు పెరిగింది



ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాం. దీంతో ఓటు నమోదు చేయించుకోవడానికి పలువురు ఆసక్తి కనబరిచారు. ఈ ఏడాది ఎక్కువ మంది మహిళలు ఓటర్లుగా నమోదు చేసుకోవడం విశేషం. కాలేజీ స్థాయి అమ్మాయిలు ఓటు నమోదు చేసుకోవడం వల్ల నమోదు శాతం పెరిగింది.

– కె.మాధవీలత, కలెక్టర్

శాసనసభ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
అనపర్తి	1,09,323	1,13,930	2	2,23,255
రాజానగరం	1,05,824	1,08083	4	2,13,911
రాజమహేంద్రవరం సిటీ	1,25,639	1,34,663	58	2,60,360
రాజమహేంద్రవరం రూరల్	1,32,531	1,38,604	24	2,71,159
కొవ్వూరు	89,442	93,958	5	1,83,405
నిడదవోలు	1,03,600	1,08,263	5	2,11,874
గోపాలపురం	1,18,783	1,23,008	7	2,41,798
మొత్తం	7,85,142	8,20515	105	16,05,762

మరణం తర్వాత పగ కూడదు



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మరణం తర్వాత పగ ఉండరాదంటూ విభీషణుడికి శ్రీరాముడు హితవు పలికాడని సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. శ్రీరామాయణం 41వ రోజు ప్రవచనాన్ని ఆయన హిందూ సమాజంలో సోమవారం కొనసాగించారు. 'ఆదిత్య హృదయాంతర్గత పరమాత్మయే రాముడు. రాముని కోసం ఇంద్రుడు దివ్య రథాన్ని, మాతలి అనే సారథిని, దివ్యకవచాన్ని, బల్లాన్ని పంపాడు. రామునికి అగస్త్యుడు సర్వమంత్రాత్మకమైన ఆదిత్య హృదయాన్ని బోధించి, ముమ్మార్లు పఠించమని సూచిస్తాడు. ఈ మంత్రం ద్వారా రామునిలోని నారాయణ తేజాన్ని అగస్త్యుడు వెలికి తెచ్చాడని మనం భావించాలి' అని సామవేదం అన్నారు. రామునికి అడవిలో అడుగడుగునా మహర్షులే మార్గాన్ని సూచించారని చెప్పారు. గాయత్రీ మంత్రద్రష్ట అయిన విశ్వామిత్రునితో ప్రారంభమైన రామకథ అడుగడుగునా మహర్షుల మార్గనిర్దేశంతోనే సాగుతూ, యుద్ధకాండలో అగస్త్యుని ఉపదేశం వరకూ నడిచిందని వివరించారు. 'మాతలి సూచనతో రాముడు బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి రావణునిపై ప్రయోగించాడు. ఆ అస్త్రం రావణుని హృదయాన్ని చీల్చి తిరిగి రాముని తూణీరంలోకి చేరింది. రావణుడు మరణించాడు. 'రావణుడు మహావీరుడు. వీరోచితంగా పోరాడి మరణించాడు. ఇది దుఃఖానికి సమయం కాదు' అంటూ విభీషణుడిని రాముడు ఊరడించాడన్నారు. మండోదరి రోదిస్తూ 'ఇంద్రియాలను జయించి గొప్ప తపస్సు చేశావు. ఇప్పుడు ఆ ఇంద్రియాలకు లొంగిపోయి, మరణాన్ని తెచ్చుకున్నావు. నీ ఇంద్రియాలే నీకు మరణాన్ని తీసుకువచ్చాయి. రాముడు యముడో, ఇంద్రుడో కాడు. నిన్ను ఎదిరించే శక్తి వారికెక్కడిది? వచ్చిన వాడు మహాయోగి' అని అంటుంది. యోగి అన్నది విష్ణు సహస్ర నామంలో విష్ణువు పేరు. రాముడు సనాతనుడయిన నారాయణుడేనని మండోదరి గుర్తిస్తుందని సామవేదం చెప్పారు. అన్నకు అంతిమ సంస్కారాలు చేయడానికి విభీషణుడు ఇష్టపడడు. రాముడు నచ్చచెబుతాడు. 'పగ అనేది శత్రువు మరణించే వరకే. మరణం తర్వాత పగ కూడదు. ఇప్పుడు రావణుడు నీకూ నాకూ గౌరవార్హుడే. నీవు నాకు ఎంతో ఉపకారం చేశావు. నీకు మంచి చెప్పడం నా బాధ్యత. నీవు రావణుని అంతిమ సంస్కారాలు చేయవలసిందే'నని రాముడు చెబుతాడంటూ సామవేదం వివరించారు. కాగా, గత నెల 12న ప్రారంభమైన రామాయణ ప్రవచన యజ్ఞం మంగళవారం ముగియనుంది. అనంతరం పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు.

రహదారి భద్రత.. సామాజిక బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రహదారి భద్రతా నియమాలు పాటించడం ప్రజలందరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు తదితరులతో కలసి కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే నెల 19వ తేదీ వరకూ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాని అన్నారు. వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, ఇతర రహదారి నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. పాదచారులకు రోడ్డు దాటే అవకాశం కల్పించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ మాధవీలత సూచించారు. జిల్లా రవాణా అధికారి కృష్ణారావు మాట్లాడుతూ, వాహనాలు నడిపే వారు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రవాణా శాఖ మార్గదర్శకాలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నరసింహులు, పర్యాటక శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌డీవీ స్వామినాయుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, బీఎస్ఎస్ నాయక్, జి.రామ్‌నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూవాడా శ్రీరామ నామస్మరణే

- అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన వేళ ప్రత్యేక కార్యక్రమాలు
- విస్తృతంగా శోభాయాత్రలు, సంకీర్తనలు
- రామాలయాల్లో ప్రత్యేక భజనలు, కల్యాణోత్సవాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జన్మస్థలమైన అయోధ్యలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా సాగిన వేళ ఊరూవాడా 'జై శ్రీరామ్' నినాదాలతో ప్రతిధ్వనించాయి. అయోధ్యలో అందాల బాల రాముని విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠిస్తున్న వేళ.. ప్రతి హిందువు ఇంట పండగ వాతావరణం నెలకొంది. పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దశరథ తనయుని ఉత్సవ విగ్రహాలతో వీధివీధినా కోలాహలంగా శోభాయాత్రలు, పల్లకీ సేవలు నిర్వహించారు. శ్రీరామ వైభవాన్ని చాటిచెప్పే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో పట్టాభిషేక మహోత్సవాలు, కల్యాణోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు.

- రాజమహేంద్రవరం ఇస్కాన్ ఆలయంలో హనుమద్ లక్ష్మణ సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులకు మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. పలు రకాల పండ్ల రసాలు, పంచామృతాలు, పుష్పాలతో అభిషేకం చేశారు.
- రాజమహేంద్రవరం నగరంలోని సుబ్రహ్మణ్య మైదానం, ఆనం కళా కేంద్రంలో కొత్త బాల మురళీకృష్ణ, విజయ రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యాన నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం రామాలయ జంక్షన్ వద్ద ప్రారంభమైన శోభాయాత్రను ప్రారంభించారు. పల్లకీలో ఆశీనులైన రామచంద్ర ప్రభువు, సీతమ్మను, హనుమంతుడిని ప్రజలు అత్యంత భక్తితో దర్శించుకున్నారు. భక్తుల రామ నామస్మరణ, భజనలు, కోలాటం, మేళతాళాలు, బాణసంచా, పలువురు దేవతల వేషధారణల సందడి నడుమ రామాలయ జంక్షన్ నుంచి శోభాయాత్ర ముందుకు సాగింది. దానవాయిపేట, దేవీచౌక్, గోకవరం బస్టాండు మీదుగా సుబ్రహ్మణ్య మైదానంలోని శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రానికి చేరుకుంది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం హిందువుల వందల ఏళ్ల నాటి కల అని, అది ఇన్నాళ్లకు నెరవేరడం, ఆ ఆలయ ప్రారంభోత్సవాన్ని కన్నులారా తిలకించే భాగ్యం దక్కడం మన పూర్వజన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా అభినవ ఘంటసాల, భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎల్‌వీ గంగాధరశాస్త్రి ఆధ్యాత్మిక ఉపన్యాసం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్ ఆలయంలో సీతారాముల ఉత్సవ మూర్తులకు అభిషేకం



రాజమహేంద్రవరం శోభాయాత్రలో శాస్త్రీయ నృత్యాలతో ఆకట్టుకున్న బాలికలు



శోభాయాత్రలో పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా 164 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె వీడి విధుల్లో చేరారని కలెక్టర్ కె.మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏడు అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో 1,556 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో 1,538 అంగన్‌వాడీ వర్కర్లు ఉండగా, ఇప్పటి వరకూ 164 మంది.. అలాగే 1,493 సహాయకులకు గాను 162 మంది విధుల్లో చేరారని వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లలో మెటర్నటీ, ఇతర కారణాలతో 9 మంది, హెల్పర్లకు సంబంధించి 16 మంది సెలవులో ఉన్నారని పేర్కొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా విధుల్లో చేరిన వారి వివరాలు

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	మొత్తం వర్కర్లు	విధుల్లో చేరినవారు	సహాయకులు	విధుల్లో చేరినవారు
గోపాలపురం	234	232	36	216	30
కొవ్వూరు	223	223	39	216	52
కోరుకొండ	228	225	17	217	14
రాజమహేంద్రవరం	165	162	34	160	31
రాజానగరం	311	306	14	302	13
రంగంపేట	184	179	6	180	7
పెరవలి	211	211	18	202	15

తత్కాల్‌లో 'సార్వత్రిక' టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు

నల్లజర్ల: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీలోగా తత్కాల్‌లో అవకాశం కల్పించారు. ఈ విధానంలో రూ.1,000 అదనంగా చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని దూబచర్లలోని స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారికి, ఇంటి వద్ద ఉండి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి చదువుకోలేని వారికి, ఉన్నత ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారికి ఇది సదవకాశమని ఆయన పేర్కొన్నారు.

ఆనందాల ఆసరా

- నేడు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నగదు విడుదల
- 30వ తేదీ వరకూ వారోత్సవాలు
- జిల్లాలోని 3,27,070 మంది మహిళలకు మేలు
- రూ.276.47 కోట్ల మేర లబ్ధి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా అక్కచెల్లెమ్మల మోములో వెలుగు పూలు పూయిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ.. నాలుగున్నరేళ్లకు పైబడిన పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తూ వస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా అమలు చేస్తున్న ఈ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. తాము అధికారంలోకి వస్తే 2019 ఏప్రిల్‌కు ముందు డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని గత సార్వత్రిక ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.



రుణమాఫీ లెక్కలు వేస్తున్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

4 విడతల్లో రూ.1,105.87 కోట్ల రుణమాఫీ

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లాలోని సుమారు 3.27 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ కింద వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకూ మూడు విడతల్లో రూ.829.4 కోట్ల మేర రుణమాఫీ చేశారు. నాలుగో విడతగా నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ జిల్లాలోని 32,707 డ్వాక్రా సంఘాల్లోని 3,27,070 మంది అక్కచెల్లెమ్మలకు మరో రూ.276.47 కోట్ల మేర వైఎస్సార్ ఆసరా నిధులు జమ చేయనున్నారు. మొత్తంగా నాలుగు విడతల్లో జిల్లాలోని డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,105.87 కోట్ల మేర రుణమాఫీ చేస్తోంది. ఆసరా నిధుల చెల్లింపు సభలు నిర్వహించేందుకు ఇప్పటికే మండలాల వారీగా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ సభల్లో ఆయా మహిళల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి అర్హుల జాబితాను ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వం ద్వారా ఇంత వరకూ ఎంత మేర ఆసరా నిధులు జమయ్యాయి, మిగిలిన వాయిదాలకు సంబంధించి ఎంత మేర రుణ మాఫీ జరుగుతుందనే విషయాలపై సంఘ సభ్యులకు వెలుగు అధికారులు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు అవగాహన కల్పిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ చేయడంపై మహిళలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానంటూ హామీ ఇచ్చి, అధికారం చేపట్టిన తర్వాత మోసం చేశారని గుర్తు చేసుకుంటున్నారు. దీనికి భిన్నంగా మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో బంగారు నగలు తయారు చేసుకొని జీవనం సాగించే ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ముమ్మిడివరానికి చెందిన కొప్పాజు లక్ష్మణరావు(22) ఆదివారం స్నేహితులతో కలసి చెయ్యేరు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని సోదరుడు ముమ్మిడివరంలో గల లక్ష్మణరావు షాపులో చూడగా అతను షాపులో పడి ఉన్నాడు. ఆసుపత్రిగా తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ముమ్మిడివరం స్టేషన్ హెచ్‌సీ భైరవ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుల మదింపు

- నేటి నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు
- 1-8 తరగతులకు సీబీఏ, 9, 10 వారికి పాత విధానం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 2.02 లక్షల విద్యార్థులు

రాయవరం: విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా పరీక్షలు నిర్వహిస్తోంది. ఏటా నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విదితమే. అందులో భాగంగా ఎఫ్‌ఏ-3 పరీక్షలను మంగళవారం నుంచి 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ 2,036 పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు 2022 నవంబర్‌లో ఎఫ్‌ఏ-1 పరీక్షలను ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎఫ్‌ఏ-2 పాత విధానంలో నిర్వహించగా, ఎఫ్‌ఏ-3 తిరిగి సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు. 9,10 తరగతుల విద్యార్థులకు మాత్రం గతంలో మాదిరిగానే ఫార్మేటివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు. ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైంది.


విద్యార్థులు


మండల కేంద్రానికి చేరుకున్న పేపర్ బండిల్స్



మండల కేంద్రాలకు పంపాం

పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లు జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పంపించాం. పరీక్ష పేపర్లకు ఎంఈవోలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.
- బి.హనుమంతురావు, ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ, అమలాపురం

విద్యార్థులకు అవగాహన ఉంది



క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన ఉంది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశాం.
- ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఉత్తమ ప్రమాణాలకు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటుగా, పక్కా బోధనతో వారి సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్య, ఉత్తమ విద్యా ప్రమాణాలకు ఈ విధానం దోహద పడనుంది. ఎఫ్‌ఏ, ఎస్‌ఏల స్థానంలో సీబీఏ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఏ1,3, ఎస్‌ఏ 2కు బదులుగా నూతన విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఎఫ్‌ఏ 2,4, ఎస్‌ఏ1 పాత విధానంలోనే నిర్వహిస్తారు. 9,10 తరగతులకు నాలుగు ఎఫ్‌ఏలు, ఎస్‌ఏలు 2 పాత విధానంలో అమలు చేస్తారు.

9,10 తరగతులకు బైలింగ్వల్ ప్రశ్నపత్రం

సీబీఏ విధానంలో 1-8 తరగతుల వారికి ప్రశ్నపత్రం పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. 9,10 తరగతులకు బైలింగ్వల్ ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రశ్నలు ఎంయూఏ విధానంలో ఇస్తారు. 15 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానం, ఐదు మార్కులకు రాత పూర్వక జవాబు రాయాల్సి ఉంటుంది. ప్రశ్నలు విద్యార్థిని సమగ్రంగా అంచనా వేసే విధంగా ఉంటాయి. మెకానికల్, అండర్ స్టాండింగ్, అప్లికేషన్ (ఎంయూఏ) విధానంలో ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 2,02,532 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో 1,08,733 మంది, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 93,799 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, వీరందరూ ఎఫ్‌ఏ-3 పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన విద్యార్థులు సాధారణ విధానంలోనే పరీక్షలు రాస్తారు. వీరికి సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహించరు.

యాజమాన్యాల వారీగా జిల్లాలో విద్యార్థుల వివరాలు

తరగతులు	ప్రభుత్వ+ఎయిడెడ్	ప్రైవేట్
1-5	42,044	56,313
6-10	66,719	37,480

టైమ్ టేబుల్

తేదీ	సమయం	సెషన్1	సమయం	సెషన్2
1-5 తరగతులు				
23	9.30-10.30	తెలుగు	1.20-2.20	గణితం
25	9.30-10.30	ప.వి	1.20-2.20	ఇంగ్లిష్-ఎ
			2.30-2.50	ఇంగ్లిష్-బి
6-8 తరగతులు				
23	1.10-2.10	తెలుగు	2.20-3.20	గణితం
25	1.10-2.10	హిందీ	2.20-3.20	సైన్స్(పీఎస్,బీఎస్)
27	1.10-2.10	సోషల్	2.20-3.20	ఇంగ్లిష్-ఎ
27	--		3.30-3.50	ఇంగ్లిష్-బి
29	1.10-2.10	ఓఎస్ఎస్‌సీ-1	2.20-3.20	ఓఎస్ఎస్‌సీ-2
9-10 తరగతులు				
23	9.30-10.15	తెలుగు	10.30-11.15	గణితం
25	9.30-10.15	హిందీ	10.30-11.15	సైన్స్(పీఎస్+బీఎస్)
27	9.30-10.15	సోషల్	10.30-11.15	ఇంగ్లిష్-ఎ
27న	11.30-11.50	ఇంగ్లిష్-బి (9వ తరగతికి మాత్రం)		
29	9.30-10.15	ఓఎస్ఎస్‌సీ-1	10.30-11.15	ఓఎస్ఎస్‌సీ-2

రూ.లక్షా 75 వేల విలువైన నకిలీ సిగరెట్లు స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో రూ.లక్షా 75 వేలు విలువైన నకిలీ సిగరెట్లను అధికారులు పట్టుకున్నారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం స్టేడియం రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో శ్రీదేవి బిస్కట్స్, జనరల్ స్టోర్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ టాక్స్ అధికారులు సోమవారం సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బ్రాండెడ్ కాని 4,010 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించారు. పారిస్, గోల్డ్ ఫైటర్, ఎ 10, హార్బర్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ విమల్, గోల్డ్ విమల్ మింట్ వంటి నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చేస్తున్న దుకాణ యజమాని దాసరి వెంకట కృష్ణారెడ్డి, సంబంధిత వ్యక్తులపై కోప్టా యాక్ట్ 2003 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. వారిని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లను నిల్వ చేసినా, అమ్మకాలు జరిపినా సదరు దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పట్టుబడ్డ సదరు బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను కాకినాడ నుంచి కొనుగోలు చేసినట్లు షాపు యజమాని తెలిపాడన్నారు. దాడుల్లో పట్టుబడ్డ దుకాణం, సంబంధిత వ్యక్తులపై నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ నాగ వెంకటరాజు, తహసీల్దార్ విజయకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు లోవకుమార్, వలీ పాల్గొన్నారు.


నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను పట్టుకున్న రీజనల్ విజిలెన్స్ అధికారులు

చంద్రవరంలో మహిళ దారుణ హత్య

కత్తితో దాడి చేసిన నిందితుడు

చాగల్లు: చాగల్లు మండలం చంద్రవరంలో మహిళపై కత్తితో దాడి చేసి హతమార్చిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం చంద్రవరం గ్రామానికి చెందిన సింహాద్రి పూర్ణచంద్రరావు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అతని భార్య సుజాత (48) తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం సుజాత కుమారుడి వివాహం సందర్భంగా ఇంటికి పెయింట్స్ వేయడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన చైతన్య కుమార్‌తో కుటుంబ సభ్యులకు పరిచయం ఏర్పడింది. సోమవారం ఇంటి డాబాపై సుజాత దుస్తులు ఆరబెడుతుండగా చైతన్యకుమార్ వచ్చి కత్తితో ఆమె మెడపై బలంగా దాడి చేసి హడావుడిగా పారిపోతుండగా కుటుంబ సభ్యులు గమనించారు. డాబాపై రక్తపు మడుగులో ఉన్న సుజాతను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కొవ్వూరు సీఐ రమణ పరిశీలించారు. సుజాత తండ్రి మద్దిపాటి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.


సుజాత మృతదేహం

పోటాపోటీగా జాతీయ టెన్నిస్ పోటీలు

డబుల్స్ విజేత హర్యానా, రన్నర్స్ గుజరాత్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డీఎస్‌ఏలో జరుగుతున్న పాఠశాల క్రీడాసమాఖ్య 67వ జాతీయస్థాయి అండర్-19 టెన్నిస్ పోటీలు సోమవారం పోటా పోటీగా జరిగాయి. మ్యాచ్‌లను రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు, పోటీల జాతీయ పరిశీలకులు రామిరెడ్డి అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రసాద్, చీఫ్ రిఫరీ శ్రీకుమార్ పర్యవేక్షించారు. డబుల్స్ విభాగంలో డిమార్ట్ సమీపంలోని టెన్నిస్ కోర్టులు, పాత ఎస్పీ ఆఫీసు టెన్నిస్ కోర్టులలో మొత్తం 24 మ్యాచ్‌లు నిర్వహించారు. డబుల్స్ విభాగంలో హర్యానా గుజరాత్ పై 2-0 స్కోర్‌తో విజయం సాధించి విజేతగా నిలువగా, గుజరాత్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. తృతీయ స్థానాన్ని మహారాష్ట్ర జట్టు, నాల్గవ స్థానాన్ని ఢిల్లీ జట్టు కైవశం చేసుకున్నాయి. క్రీడాకారులకు వసతి నుంచి క్రీడా మైదానాలకు మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.మోహన్‌రావు సౌజన్యంతో ఉచితంగా బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన మ్యాచ్‌లను ఆర్జేడీ నాగమణి, డీవైఈఓలు రాజు, సుభద్ర, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈఓలు రవి, ఏసుదాసు, శివ, ప్రసాద్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, బంగార్రాజు, రంగారావు తిలకించారు. పోటీల నిర్వహణ కమిటీలలో పీడీలు భానుమతి, ప్రసాద్, మేరి విజయ, త్రిపుల, తులసి, సత్యగౌరి, సువర్చల, శ్రీహరి సేవలు అందించారు.


జాతీయ టెన్నిస్ పోటీలలో డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచిన హర్యానా జట్టు

బాలిక హత్య కేసులో సవతి తల్లికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: బాలికను హత్య చేసినందుకు సవతి తల్లికి జీవిత ఖైదు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ డెయిరీ ఫారం సెంటర్, సంజయ్‌నగర్, కొత్తపాకలు ప్రాంతానికి చెందిన సూరాడ శాంతి కుమారి 2019 నవంబర్ 22వ తేదీన తన సవతి కుమార్తె అయిన ఏడేళ్ల సూరాడ దీప్తిని జగన్నాథపురంలో చదువుతున్న స్కూల్ వద్ద నుంచి సంజయ్‌నగర్‌లో ఉంటున్న ఇంటికి తీసుకువెళ్లింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆమె ఈ పనిచేసింది. అనంతరం బాలిక పీకను తువ్వాలుతో నులిమి హత్య చేసి, బాలికను మూటకట్టి ఇంద్రపాలెం బ్రిడ్జిపై నుంచి ఉప్పుటేరు కాలువలోకి పడవేసింది. బాలిక తండ్రి సత్య శ్యామ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు పై వన్‌టౌన్ పోలీసు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో శాంతి కుమారిపై నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతి కుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గండేపల్లి: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించగా పెద్దాపురం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆయన కథనం మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన షేక్ బాజీబాబా మోటార్ సైకిల్‌పై విశాఖ జిల్లా వెళ్లి అక్కడ ఏజెన్సీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద ఆరు కేజీల గంజాయిని రూ. 12,000కు కొనుగోలుచేసి సోమవారం విశాఖ నుంచి తన స్వగ్రామం బయలుదేరినట్టు తెలిపారు. గంజాయి తరలిస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు గండేపల్లి శివారు దాబా వద్ద ఎస్సై ఎస్.రామకృష్ణ తన సిబ్బందితో హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా బాజీబాబా వద్ద రెండేసి కేజీల చొప్పున మూడు ప్యాకెట్లు గంజాయిని బ్యాగ్‌లో ఉంచి తరలిస్తున్నట్టు గుర్తించారు. అతని వద్ద ఉన్న గంజాయిని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు తెలియజేశారు.


1,398 మద్యం సీసాలతో మహిళ అరెస్ట్

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 1,398 మద్యం సీసాలను కోరంగి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మహిళ పెస్సింగి దుర్గ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు దాడి చేయగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఆ మహిళను అరెస్ట్ చేసి కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.1.50 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి

మామిడికుదురు: గోగన్నమఠం లైన్‌మన్‌గా పనిచేస్తున్న నవుండ్రు రాంబాబు (49) సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. రొయ్యల చెరువుల వద్ద స్తంభంపైకి ఎక్కి రీ కనెక్షన్ ఇస్తుండగా షాక్‌కు గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రొయ్యల చెరువులకు సంబంధించిన విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో ఆ లైన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం బిల్లు చెల్లించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రాంబాబు స్తంభం ఎక్కాడు. అయితే అప్పటికే ఎవరో ఆ లైన్‌కు విద్యుత్ సరఫరాను పునురుద్ధరించారు. ఈ విషయం తెలియని రాంబాబు స్తంభం ఎక్కి ప్రమాదానికి గురై కిందపడి మరణించాడు. అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామానికి చెందిన రాంబాబు ఏడాదిన్నర కాలంగా ఇక్కడ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. నగరం ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


రాంబాబు మృతదేహం

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా


రాజానగరంలో ఇంటింటికీ వెళ్లి ఆరా తీస్తున్న రాష్ట్ర జెపిఎస్ నోడల్ అధికారి డాక్టర్ గ్లోరీ

రాజానగరం: పేదలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం మంజూరు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పై రాష్ట్ర జెపిఎస్ నోడల్ అధికారి డాక్టర్ గ్లోరీ ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించిన ఆమె తొలుత పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డులు, పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య, తదితర వివరాలపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం గ్రామంలో కొన్ని గృహాలను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ కార్డులు సక్రమంగా అందుకున్నారా, ఏమైనా ఇబ్బందులు పడ్డారా, అంటూ ఆరా తీశారు. అయితే ఎక్కడా ఎటువంటి రిమార్కు రాకపోవడంతో సిబ్బంది సేవలను అభినందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏంజెల్, సూపర్‌వైజర్ ఎస్‌వీవీ రమణ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నర్సరీలను సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌వో

కడియం: మండలంలోని కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీ, కడియంలోని పల్ల వెంకన్న నర్సరీలను డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వేంకటేశ్వరరావు దంపతులు సోమవారం సందర్శించారు. నర్సరీల్లో ఏర్పాటు చేసిన అయోధ్య రామాలయం మొక్కల కూర్పులను దర్శించి, రైతులను అభినందించారు. ఆయన వెంట స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

వాలీబాల్ టోర్నీలో ప్రథమ స్థానం

ప్రకాశం నగర్ : ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాల్లో భాగంగా విజయవాడలో నిర్వహించిన ఏపీ ఎస్‌పీఎఫ్ స్పోర్ట్ మీట్ 2024లో ఎస్‌పీఎఫ్ రాజమహేంద్రవరం జోన్‌కు చెందిన క్రీడాకారులు వాలీబాల్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు కమాండెంట్ త్రివిక్రమ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ట్రోఫీని అందజేసి అభినందనలను తెలిపినట్లు చెప్పారు. రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ కొండా నరసింహారావు ఇతర అధికారులు విజేతలను అభినందించినట్లు పేర్కొన్నారు.


ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఎస్‌పీఎఫ్ క్రీడాకారులు

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎస్‌కేవీటీ విద్యార్థి

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : చెన్నైలో జరిగిన ఖేల్ ఇండియా యూత్ గేమ్స్ ఓపెనింగ్ కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థి తాడేపల్లి సూర్య పాల్గొన్నట్లు ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎబల్ రాజబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు 302 మంది పాల్గొని, యోగాలోని పూర్ణ సులభాసనాన్ని 1.20 నిమిషాల పాటు ప్రదర్శించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి సాధించారని తెలిపారు. విద్యార్థికి స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిషోర్ బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారని చెప్పారు.